క్లుప్తంగా

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన


సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రాజేందర్ (బైక్ వెనకల కూర్చున్న వ్యక్తి)

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజేందర్ బైక్‌పై ఆయా వార్డుల్లో బుధవారం పర్యటించారు. ద్వారకానగర్, బారెవాడ, శ్రీకృష్ణనగర్ కాలనీ ఆయాకాలనీల్లో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు పర్యటించారు. బారెగవాడలో నిర్మించిన మురుగు కాలువ అస్తవ్యస్తంగా ఉందని కాలనీ వాసులు తెలుపడంతో కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దశల వారీగా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు.

ఎంఈవో పాఠశాలల సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: మండలంలోని చొపన్‌గూడ, సార్ద ప్రాథమిక పాఠశాలలను బుధవారం మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను ఐఎస్ఎంఎస్ పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. పిల్లలను బోర్డుపై రాయించారు. పాఠ్య పుస్తకాలను చదివించారు. హెచ్‌ఎం వాణి, అరుణ్ ఉన్నారు.

ఆటపాటలతో మహిళాశక్తి సంబురాలు


అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని మోతుగూడ గ్రామంలో సాయినాథ్ గ్రామ సమాఖ్య ప్రత్యేక సమావేశం, ఇందిరా మహిళాశక్తి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ సాంస్కృతిక బృందం కళాజాత వారి ఆధ్వర్యంలో ఆటపాటల ద్వారా రాష్ట్ర మహిళా సంఘాల సభ్యులకు అందించే సంక్షేమ పథకాలు వివరించారు. కళాబృందం కోఆర్డినేటర్ మోహన్ నాయక్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఏపీఎం సదానందం తదితరులు ఉన్నారు.

ఎంపీడీవోకు వినతి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ ఎంపీటీసీ స్థానానికి పెంచికల్‌పేట్ పేరునే కొనసాగించాలని గ్రామస్తులు ఎంపీడీవో అల్బర్ట్‌కు బుధవారం వినతిపత్రం అందచేశారు. పునర్విభజనలో భాగంగా ఎల్లూర్, పెంచికల్‌పేట్ గ్రామాలతో ఎల్లూర్ ఎంపీటీసీగా ఎలాంటి అభిప్రాయ సేకరణ లేకుండా గెజిట్ విడుదల చేశారని మండిపడ్డారు. పెంచికల్‌పేట్ పేరుతోనే ఎంపీటీసీ స్థానాన్ని కొనసాగించాలని లేదంటే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఇస్తారి, ఉస్మాన్, తిరుపతి, శేఖర్, రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, గుండయ్య, శంకర్, సాయి, శ్రీకర్ పాల్గొన్నారు.

గోరింటాకు సంబురాలు


గోరింటాకు పెట్టుకున్న మహిళలు

కాగజ్‌నగర్ టౌన్: ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కాపువాడలోని మున్నూరు కాపు సంఘం భవనంలో మహిళలు గోరింటాకు సంబురాలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులతో గౌరమ్మను పూజించారు. మహిళలందరూ కలిసి గోరింటాకును పెట్టుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఆసిఫాబాద్: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్‌అహ్మద్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ నాయకులు అబ్దుల్లా, ముషీర్, అమీర్ ఉన్నారు.

వానాకాలం.. అప్రమత్తతే రక్ష!

- నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలు
- వేలాడే విద్యుత్ తీగలు గుర్తించాలి
- తడి చేతులతో స్తంభాలు, తీగలు పట్టుకోవద్దు


కెరమెరి విద్యుత్ సబ్‌స్టేషన్


కొరాఠీలో స్తంభం ఎక్కి విద్యుత్‌వైర్లు సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

కెరమెరి: వానాకాలంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా విద్యుత్ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. అజాగ్రత్తగా ఉంటే ప్రాణాలు గాల్లో కలుస్తాయి. గాలి వీచినా, భారీ వర్షాలు కురిసిన సమయంలో కరెంటు తీగలు తెగిపడుతుంటాయి. వాటిని గమనించకుండా వెళ్తే ప్రాణాప్రాయం సంభవిస్తుంది. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ముప్పు అధిగమించవచ్చు. వానాకాలంలో గృహవినియోగదారులతో పాటు రైతులు విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండడం మంచిది. మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో గృహవిద్యుత్ మీటర్లు 4234, వ్యవసాయ మీటర్లు 508 ఉన్నాయి. విద్యుత్ సిబ్బంది 13 మంది విధులు నిర్వహిస్తున్నారు.

వ్యవసాయ బోరు మోటార్ల వద్ద..
మండలంలో గడిచిన ఏడాది నుంచి వ్యవసాయ మోటార్ల వినియోగం పెరిగింది. గతంలో వ్యవసాయ విద్యుత్ మీటర్లు 300 ఉండగా, ఈ ఏడాది 508 ఉన్నాయి. ప్రధానంగా బోరు బావుల వద్ద స్టార్టర్లు, తీగలు అస్తవ్యస్తంగా ఉంటాయి. వాటి నిర్వహణ సరిగా లేక ప్రమాదాలు సంభవిస్తుంటాయి. మోటార్లు ఆన్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. వేలాడే తీగలను ముందే గుర్తించాలి. స్టార్టర్ డబ్బా వద్ద తీగలను సరిచేయాలి. ఫ్యూజులను తరుచూ పరిశీలించాలి. వాన పడుతున్నప్పుడు బోర్ ఆన్ చేయకుండా కాళ్లకు రబ్బరు చెప్పులు, చేతి తొడుగులు తప్పక ధరించాలి. స్టార్టర్ బాక్సుల్లో విషసర్పాలు, ఎలుకలు చేరి తీగలు కొరికేస్తాయి. వాటిని గమనించకుండా రైతులు ఆన్‌చేస్తే విద్యుదాఘాతం సంభవించే ఆస్కారం ఉంది. తడి చేతులతో స్తంభాలు, తీగలను పట్టుకోవద్దు. ఫైబర్ స్టార్టర్ డబ్బా వినియోగిస్తే మేలు.

చెట్ల కింద ఉండొద్దు..
విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు వచ్చినప్పుడు, తీగలు తెగినప్పుడు సొంతంగా మరమ్మతులు చేయకూడదు. వాటికి చాలా దూరంగా ఉండాలి. పశువులు వాటి వద్దకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలి. వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేసే సమయంలో ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకోవాలి. చెట్ల కింద చేరద్దు. తీగల కింద ఉండొద్దు.

ప్రమాదాల నివారణకు అవగాహన



ప్రమాదాల నివారణకు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. వర్షాకాలంలో విద్యుత్ పరికరాల వద్ద జాగ్రత్తలు పాటించాలి. ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేయాలి. సమస్యను అప్పటికప్పుడే పరిష్కరించుకోవాలి. – రమేశ్, ఏఈ, కెరమెరి

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాంచందర్

లింగాపూర్: మండలంలోని గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో రాంచందర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం వివిధ గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులతో పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏవో సంజయ్ కుమార్, ఎంఈవో శ్రీనివాస్, ఏపీవో చంద్రయ్య, ఎంపీవో రజనీకాంత్, సూపర్‌వైజర్ దత్తారాం, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
దహెగాం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సజీవన్ అన్నారు. బుధవారం మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. అదే విధంగా వైద్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ మునవార్ షరీఫ్, ఇన్‌చార్జి ఎంపీడీవో అల్బర్ట్, ఎంఈవో శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ రవీందర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి
వాంకిడి: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాథోడ్ బిక్కు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, టోకెన్ల ద్వారా రైతులకు సకాలంలో పంపిణీ చేయాలని ఏవో గోపికాంత్‌ను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు మార్క్‌ఔట్ ఇచ్చి నిర్మాణ దశలోకి తీసుకురావాలని సూచించారు. మొక్కలను విరివిగా నాటాలని, తక్కువ పురోగతి ఉన్న గ్రామ పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ శైలేందర్, ఏఈ హౌజింగ్ నాగరాజు, ఏపీవో శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
కెరమెరి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి వెంకట్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామ పంచాయతీల వారీగా ఇచ్చిన మొక్కల టార్గెట్ పూర్తి చేయాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో అంజద్‌పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ అక్యానాయక్, మెడికల్ అధికారి రియాజ్ ఉన్నారు.

బియ్యం పంపిణీ, ధాన్యం కొనుగోళ్లపై ఆరా

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని రేషన్ షాపుల తోపాటు సీతానగర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం కొనుగోళ్లపై బుధవారం కేంద్ర ఆహార పంపిణీ వ్యవహారాల డిప్యూటీ డైరెక్టర్ మనోజ్ కుమార్ మిశ్రా ఆరా తీశారు. ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని డీలర్లను ప్రశ్నించా రు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఏ విధంగా సేకరించారు.. రైతులకు డబ్బులు సకాలంలో చెల్లించారా.. లేదా.. అని పీఏసీఎస్ సెక్రెటరీ సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు పట్టణంలోని ఎఫ్‌సీఐ గోదాం సందర్శించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి సాదిక్, మే నేజర్ నర్సింహులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్, పోచయ్య, పీఏ సీఎస్ సీఈవో ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ టౌన్: ప్రభుత్వ అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని ద్వారకానగర్, వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ పథకం ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ప్రణాళికాబద్ధంగా నిర్మించుకోవాలన్నారు. అనంతరం వార్డులో పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు పలు సమస్యలను వివరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను ఆదేశించారు. జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, మాజీ కౌన్సిలర్లు సిందం శ్రీనివాస్, బంక శివకుమార్, నాయకులు గజ్జి లక్ష్మణ్, బల్క శ్యామ్, చిప్పకుర్తి శ్రీనివాస్, నికోడె అర్జున్, కొండ తిరుపతి, కాలనీవాసులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రెయినేజీ పూడిక తీత చేపట్టాలన్నారు. అనారోగ్యానికి గురైన వారిని గుర్తించి వెంటనే ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న అధికారులు

కెరమెరి: మొక్కలు నాటడమే కాదు, వాటి పరిరక్షణ కూడా అందరి బాధ్యత అని, ఎఫ్ఆర్‌వో మజారోద్దీన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని దేవాపూర్‌లో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా బుధవారం 21వేల మొక్కలను పంపిణీ చేశామని, 11 వేల మొక్కలు నాటామన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

చింతలమానెపల్లి: జిల్లాలో యూరియా కొరత లేదని రైతుల అవసరాలకు సరిపడా సరఫరా చేస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని డబ్బా గ్రామంలో రైతులతో మాట్లాడారు. యూరియా విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం బాలాజీ అనుకోడ రైతువేదికలో ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాల డీలర్లతో సమావేశమయ్యారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, అక్రమాలు జరగకుండా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు సరఫరా చేయాలని సూచించారు. యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు డీలర్లు తమ సేవలందించాలని పేర్కొన్నారు. చింతలమానెపల్లి మండలంలో 40వేల బస్తాల డిమాండ్ ఉందని ఇప్పటికే 8వేల బస్తాల యూరియా సరఫరా చేశామని గురువారం 1200 బస్తాల యూరియా మండలంలో సరఫరా చేస్తామని పేర్కొన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి కార్తీష, ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ

ఆసిఫాబాద్‌అర్బన్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని ఆసిఫాబాద్ మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా ఈ నెల 12లోగా మొక్కలు పంపిణీ పూర్తిచేసి, ఈ నెల 20లోగా నాటడం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో మౌనిక, ఆర్‌డబ్ల్యూ ఏఈఈ ఆదిత్యకుమార్, అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వినోద్‌కుమార్, మెడికల్ అధికారి వెంకటేశ్, ఏపీవో బుచ్చన్న పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కాగజ్‌నగర్ టౌన్: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ విలాస్, కన్వీనర్ ఎమ్మాజీ సతీష్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో జాక్ జిల్లా కోకన్వీనర్ ఇర్ఫాన్ అహ్మద్, 1104 యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, 327 యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు జగన్మోహన్, శ్రీనివాస్, రమేశ్, మురళీ, రామకృష్ణ, ప్రవీణ్, జనార్దన్ పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం
దహెగాం: దేశవ్యాప్తంగా బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైందని మండల సీఐటీయూ నాయకులు అన్నారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం దహెగాం, కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ మండల కో కన్వీనర్ వజ్రమ్మ మాట్లాడుతూ.. వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు., అదే విధంగా నెలకు కనీస పెన్షన్ 9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశలు, పంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండలంలో పని చేస్తున్న అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీచౌక్‌లో రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు.

కెరమెరి: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ రావు అన్నారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బస్టాండ్ ప్రాంతం వరకు కార్మికులు డప్పులతో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి కూటికల ఆనంద్‌రావు, నాయకులు రమేశ్, సంతోష్, స్వామి, అనసూయ, రాధ, గుణసుందరి, సరోజా, సావిత్రి, సంగీత, బొజ్జుబాయి, పగ్గుబాయి తదితరులు ఉన్నారు.

తిర్యాణి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్ అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద వివిధ కార్మిక సంఘాల నాయకులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు గుండం శంకర్, పార్వతి, భీంబాయి, చంద్రకళ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కౌటాల: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పంచాయతీ, మధ్యాహ్న భోజన, హమాలీ కార్మికులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు బుధవారం కౌటాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆర్ త్రివేణి, మండల కన్వీనర్ నగేశ్, మోరేశ్వర్, మొగ్ర, శారద, జిజాబాయి, అర్చన, సుందరీ, లక్ష్మి పాల్గొన్నారు.


లింగాపూర్: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


కెరమెరి: ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు


సిర్పూర్(టి): దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం సిర్పూర్(టి) మండలంలోని కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు కాంతమ్మ, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో అసంఘటితర రంగాల ఉద్యోగుల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. మండల కేంద్రంలోని ర్యాలీ నిర్వహించి, అనంతరం శివాజీ చౌరాస్తాలో రాస్తారోకో చేపట్టారు. తమ డిమాండ్లను తీర్చాలని కోరుతూ నినాదాలు చేశారు. నాయకులు శ్రీలత, విలాస్, టి.రవి, ప్రమీల, పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కెరమెరి: మండలంలోని సుల్తాన్‌గూడలో గల ఐఈఆర్‌సీ కేంద్రంలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ ఆయా పోస్టుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి, 20 -30 ఏళ్లలోపు ఉన్న వికలాంగ విద్యార్థి తల్లి అయి ఉండాలన్నారు. ఐఈఆర్‌సీ కేంద్రానికి సమీపంలో ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 14లోపు మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు.

జీవో 49 రద్దుకు గ్రామసభ తీర్మానం


మాట్లాడుతున్న కోవ విజయ్

కెరమెరి: జీవో 49 రద్దు చేయాలని కోరుతూ మండలంలోని కెస్లాగూడ ఆదివాసీలు గ్రామసభలో తీర్మానం చేశారు. మంగళవారం రాత్రి గ్రామంలో పేసా గ్రామసభ ఏర్పాటు చేశారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ మాట్లాడుతూ.. భూసేకరణ, పునరావాస ప్రక్రియల్లో గ్రామసభలను సంప్రదించడం తప్పనిసరి అన్నారు. తప్పుడు పత్రాలతో ప్రభుత్వం అక్రమంగా, పేసా తీర్మానం లేకుండా జీవో జారీ చేయడాన్ని గిరిజనులు తిరస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పటేల్ కుమురం భీంరావు, సత్‌పత్‌రావు, పేసా గ్రామసభ అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సోషల్‌మీడియా వినియోగంపై జాగ్రత్తలు పాటించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీశ్

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యార్థులు సోషల్‌మీడియా ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రత చర్యలు తీసుకోవాలని ఎస్సై సతీశ్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు షీటీం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థులు వేధింపులకు గురైతే ఆసిఫాబాద్ షీటీం నంబర్ 87126 70564, లేదా 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కర్నూ, అధ్యాపకులు, షీటీం సిబ్బంది స్వప్న, రజని, దినేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.